ప్రజాశక్తి

సోమవారం 29 జులై 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

కేంద్ర బడ్జెట్‌లో

జిల్లాకు రూ.10వేల కోట్లు ప్రకటించాలి

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అప్పులు మూట తప్ప గ్రాంటు ఏమి ఇవ్వలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజా అనుకూల బడ్జెట్‌గా మార్చాలని, కేంద్ర బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాకు రూ.10వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాగర్ హోటల్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. కార్పొరేట్ వర్గానికి, సంపన్నులకు ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్ రూపకల్పన చేశారని విమర్శించారు. సామాన్యులకు కేటాయించాల్సిన బడ్జెట్‌లో అనేక అంశాల్లో కోతలు విధించారని విమర్శించారు. ఆహార సబ్సిడీలపై, ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత విధించారన్నారు. ఇతర సంక్షేమ పథకాలకు కూడా కోతలు విధించారని విమర్శించారు. కార్పొరేట్, సంపన్న వర్గాలకు మరిన్ని రాయితీలు ఇచ్చి వారికి ప్రయోజనాలు చేకూర్చేలా మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందని దుయ్యబట్టారు. తాము ఎన్‌డిఎ పక్షానే ఉన్నామని చెప్పుకుంటున్న టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో తీవ్రంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు అప్పు ఇస్తామని చెప్పారు తప్ప గ్రాంటు ఇవ్వడానికి బడ్జెట్‌లో ప్రతిపాదన ఏదీ లేదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధులు భారీగా ఉన్నాయ ఎన్నారు. ఎన్‌డిఎకు మద్దతిస్తున్న బీహార్ ప్రభుత్వానికి కూడా భారీగా నిధుల కేటాయింపులు చేశారని విమర్శించారు. ఏపీకి మాత్రం అప్పులు

▶ 2లో

బాలినేని పార్టీకి దూరమవుతున్నారా..?

- ఎన్నికల తర్వాత ఇంత వరకూ జగన్‌ను కలవని మాజీమంత్రి
- మొన్న చెవిరెడ్డి నియామక ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం
- నిన్న ఢిల్లీలో పార్టీ ధర్నాకూ దూరం..
- జగన్ ఏకపక్షనిర్ణయాలపైనే గుర్రు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి రానురానూ వైసిపికి దూరమవుతున్నారా? ఆపార్టీలో కొనసాగేందుకు సముఖంగా లేరా? భవిష్యత్‌లో పార్టీ వీడి వేరే పార్టీలోకి వెళతారా?లేక రాజకీయాలకు దూరమవుతారా ?అన్నది ఇపుడు చర్చగా మారింది. ప్రస్తుత పరిణామాలు, ఆయన వైఖరి ఇందుకు అద్దం పడుతున్నాయి. ఇప్పటికిప్పుడు పార్టీ వీడకపోయినా వైసిపిలో మాత్రం ఆయన ఉత్సాహంగా పనిచేసే పరిస్థితి కనిపించడం లేదనే చర్చ సాగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం ఇంత వరకూ పార్టీ అధినేత జగన్‌ను కలవలేదు. వీరిద్దరి మధ్య మాటలు కూడా ఉన్నట్లు కనిపించడం లేదు. కారణాలు అనేకం కని పిస్తున్నాయి. మాజీ మంత్రి బాలినేని ఎన్నికల ముందు నుంచే అధినేత తీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. వైసిపి అధికారం లోకి వస్తుందనే నమ్మకం కూడా ఆయనలో లేదు. సన్నిహితుల వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించారని వినికిడి. ఎన్నికల ఫలితాల తర్వాత హైదరాబాదుకు వెళ్లిన ఆయన ఇటీవలే జిల్లాకు వచ్చి రెండు రోజులు ఉన్నారు. ఇక్కడ తన రాజకీయ ప్రత్యర్థి దామచర్ల జనార్ధన్‌ను లక్ష్యంగా చేసుకుని రెండు రోజులూ మీడియా సమావేశం పెట్టి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే దామచర్ల కూడా బాలినేనిపై అదే స్థాయిలో ధ్వజమెత్తారు. అనేక అంశాలపై వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడిచింది. ఈ వారంలోనే ఒంగోలులో అనేక నాటకీయ పరిణామాలు నడిచాయి. ప్రస్తుతం అది సద్దుమణిగింది. బాలినేని రాజకీయ భవితవ్యమే స్పష్టత లేదు. ఆయన అనుచరులు, పార్టీశ్రేణుల్లోనూ గందరగోళం నెలకొంది. కార్పొరేటర్లకూ ఇదే చెప్పారు. ఉండేవాళ్లకు అండగా ఉంటానని.. వెళ్లేవాళ్లను ఆపలే మన్నారు. దీంతో ఆయన హైదరాబాదు వెళ్లిన మరుసటి రోజునే కొందరు కార్పోరేటర్లు ఎమ్మెల్యే దామచర్లను కలిసొచ్చారు. దామచర్ల పార్టీలోకి ఎవరినితీసుకోవాలి? కార్పోరేషన్‌లో ఎలాంటి వ్యూహం వ్యవహరించాలనే దానిపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. దీంతో వాటి వ్యవహారం ప్రస్తుతం పక్కకుపోయింది. ఇక బాలినేని హైదరాబాదులోనే ఉన్నారు. పార్టీకి దూరంగా ఉండటం చర్చగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిని పెట్టాలని ఆపార్టీ అధినేత జగన్ ప్రతిపాదించారు. దీనిపై బాలినేని భగ్గుమన్నారు. పొరుగు జిల్లాల నుంచి పెట్టాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా పార్టీ ఏమైనా గొడ్డు పోయిందా?అని మీడియా సమావేశం లోనే వ్యాఖ్యా నించారు. అంటే అధినేత నిర్ణయాన్ని ఓపెన్‌గానే వ్యతిరేకించారు. దీనిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనం తీవ్ర చర్చకు తావిచ్చింది. దీంతో అధిష్టానం పెద్దలు బాలినేనితో సంప్రదించారు. తొందర పడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని చెప్పి ఈ వ్యవహారానికి ముగింపు పలికారు. తర్వాత రాష్ట్రంలో వైసిపి కార్యకర్తలపై దాడులను నిరసిస్తూ ఢిల్లీలో జరిగిన ధర్నాకు సీనియర్ నేత బాలినేని వెళ్లలేదు. అసలు ఆయన్ను అధినేత జగన్ ఆహ్వానించారా? లేదా?అన్నదీ స్పష్టత లేదు. ఏదేమైనా ఆయన వెళ్లలేదు. అధికారం వచ్చి నెలరోజులు కాకుండానే రాష్ట్రపతి పాలన ఏమిటి? అవగాహన లేకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే మరింత నష్టపోతామని బాలినేని పార్టీనేతలతో అన్నట్లు

▶ 2లో

సుందరయ్య ప్రజాసంఘాల భవనం ద్వారా

ప్రజా సమస్యలపై విశాల ఉద్యమాలు

కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. శ్రీనివాసరావు

మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి బాపట్ల

ప్రజా ఉద్యమాల పురిటి గడ్డ బాపట్లలో నిర్మించిన పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల భవనం ప్రజా సమస్యలుపై విశాల ఉద్యమాలకు ఎంతగానో దోహదపడుతుందని కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. శ్రీనివాసరావు తెలిపారు. బాపట్లలో నూతనంగా నిర్మించిన పుచ్చలపల్లిసుందరయ్య ప్రజాసంఘాలు భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. నూతన భవన శిలాఫలకాన్ని వి.శ్రీనివాసరావు, మీటింగ్ హాలును సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి , ఆఫీసు గదులను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రారంభించారు అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.గంగయ్య అధ్యక్షతన బహిరంగ సభలో నిర్వహించారు. సభలో వి,శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపితో స్నేహం చేసిన ప్రాంతీయ పార్టీలు బతికి బట్టకట్టిన దాఖలాలు లేవన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని నిర్మాణం కోసం అప్పుగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఢిల్లీలో మేము లేకపోతే మోడీ ప్రభుత్వమే లేదని రాష్ట్రంలో గొప్పలు చెప్పుకునే నాయకులు అందరినీ కలుపుకొని రాష్టానికి నిధులు కోసం పోరాడాలన్నారు. బిజెపి ప్రజల మధ్య మతం పేరుతో చీలికలు తెస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల హక్కులు హరిస్తూ బిజెపికి అనుకూలంగా లేని రాష్ట్రాలకు నిధులు తగ్గించటం సిగ్గుచేటన్నారు.

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం పాత పద్ధతులే కొనసాగిస్తుందన్నారు. గత మద్యం పాలసీని వ్యాపారంగా మార్చుకుని అమలు చేస్తుందన్నారు. గతంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమన్నా టిడిపి నేతలు ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టడం అంటే ప్రజలను మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో అత్యాచారాలు,హత్యలు కొనసాగు తున్నాయిని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ రాజకీయ కక్షలతో చిరుఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశా, ఐకెపి,విఒఎ,

▶ 2లో

బస్సును తప్పించబోయి.. ట్రాక్టర్ బోల్తా

- ముగ్గురు దుర్మరణం
- 11 మందికి గాయాలు
- దైవ దర్శనానికి వెళ్తుండగా ఘటన

ప్రజాశక్తి - కర్లపాలెం,బాపట

రహదారి మలుపు వద్ద ఎదురుగా బస్సును తప్పించబోయి అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిధి లోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో దమ్మనవారిపాలెం వెళ్లే రహదారిలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన

▶ 2లో

మృతి చెందిన గడ్డం శివనాగులు

మృతిచెందిన గట్టు కోటేశ్వరావు

మృతి చెందిన గడ్డం లక్ష్మి

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

యుఎంహెచ్ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి డిమాండ్ • ఉత్సాహంగా సంఘ 7వ మహాసభ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైద్య,ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక నండూరి ప్రసాదరావు భవన్‌లో ఆదివారం జరిగిన యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రకాశం జిల్లా కమిటీ ఏడో మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తాళ్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల కాంట్రాక్టు ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని అన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై సుభాషిణి మాట్లాడుతూ సచివాలయ ఎఎన్ఎంలను గ్రేడ్-2గా పదోన్నతి కల్పించి వారికి ఓపిఎస్ అమలు చేయాలన్నారు.

మాట్లాడుతున్న తాళ్లూరి వెంకటేశ్వర్లు

వీరందరినీ వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సేవలు అందించే వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన కాకుండా రెగ్యులర్‌గా నియమించాలన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ, సిఐటియు కమిటీలు ఇచ్చే పిలుపుమేరకు వైద్య, ఆరోగ్య ఉద్యోగులు ఐక్యంగా ఉండి వారి హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ అధ్యక్షులు జి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి నుంచి పైస్థాయి ఉద్యోగుల వరకు అన్ని క్యాడర్ల ఉద్యోగులను ఐక్య పరచడమే యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ లక్ష్యమని అన్నారు. ప్రకాశం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి కె శ్రీధర్ బాబు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పని ఒత్తిడి పెరిగిందని, ప్రకాశం జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. అనంతరం రెగ్యులర్ అయిన కాంట్రాక్టు ఉద్యోగులను యూనియన్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వై సురేష్ బాబు, జె వెంకటేశ్వరరెడ్డి, భరత్ భూషణ్, బి కృష్ణ, ఎం రమణమూర్తి, ఇ ధనలక్ష్మి, కె జయకుమారి, జి అంజనీ దేవి, బి వెంకటేష్, సి శారద, ఆర్ కృష్ణ కుమారి, వై వెంకట్, మంత్రు నాయక్ పాల్గొన్నారు.

అధ్వానంగా జాతీయ రహదారి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పేరుకు అది జాతీయ రహదారి. ఇటు వైపు రేణిగుంట సమీపం నుంచి ప్రారంభమై హైదరాబాద్ మహా నగరానికి దారి తీస్తుంది. నిత్యం వేలాది వాహనాలు ఈ దారి వెంట వెళుతుంటాయి. అయితే నల్లమల్ల అటవీ ప్రాంతానికి రాగానే ఈ జాతీయ రహదారి వాహన చోదకుల సహనానికి పరీక్ష పెడుతుంది. చిట్టడవిలో సింగిల్ రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. ఇదీ 565 నెంబర్ జాతీయ రహదారి తీరు తెన్నూ. జాతీయ రహదారి 565 యర్రగొండపాలెం మీదగా హైదరాబాద్‌కు వెళుతుంది. ఈ రహదారి వెంబడి పుల్లలచెరువు మండలంలో రోడ్డుకు ఇరువైపుల 22 కిలోమీటర్ల పొడవునా నల్లమల అడవి ఉంది. ఈ 22 కిలోమీటర్లు జాతీయ రహదారిలో భాగంగా ఉన్నప్పటికీ, సాంకేతికంగా నేటికీ ఆర్అండ్‌బి పరిధిలోనే ఉంది. 2013-14 సంవత్సరాలలో జాతీయ రహదారి పనులు చేసినప్పటికీ ఈ 22 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారి ఏర్పాటుకు అటవీశాఖ అనుమతి ఇవ్వలేదు. దీంతో నేటికీ ఆర్అండ్‌బి పరిధిలోనే ఉంది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం నుంచి పుల్లలచెరువు మండలం మల్లాపాలెం క్రాస్ రోడ్డు వరకు జాతీయ రహదారి నిర్మించలేదు. ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ రోడ్డులో ట్రాఫిక్ పెరగడంతో తరచూ రోడ్డు మరమ్మతుకు గురవుతోంది. రహదారి అంచులు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డుపై అనేక చోట్ల గోతులు పడ్డాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

2021లో నిధులు వచ్చినా..

2013-14లో ప్రారంభమైన ఈ జాతీయ రహదారిలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి 2021లో ప్రపంచ బ్యాంకు నిధులు ఇచ్చింది. రూ.50 కోట్లతో 45 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి నిధులు వెచ్చించాలని నిర్ణయించారు. అయినప్పటికీ ఈ 22 కిలోమీటర్లకు నిధులు వెచ్చించి రోడ్డు వేయలేదు. ఇంచుమించు ఎనిమిదేళ్ల కాలం గడిచినప్పటికీ అటవీ శాఖ అనుమతులు తీసుకోకపోవడంతో అడవిలో 22 కిమీ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. సింగిల్ రోడ్డుగానే నేటికీ మిగిలి ఉంది. దీంతో ఈ అడవి మార్గంలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రహదారి అంచుల్లో తారు కోతకు గురైంది. రోడ్డుపై ఆడుగులోతు గోతులు పడి ఉన్నాయి. ఎదరుగా వచ్చే వాహనాలను తప్పించడానికి అంచుల్లోకి కారును దించితే కింద బ్యానెట్ రోడ్డుకు గుద్దుకొని మరమ్మతులకు గురవుతోంది. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అయినప్పటికీ, వాహన చోదకులు ఈ దారినే రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రమాదభరితంగా రోడ్డు అంచులు

జాతీయ రహదారి కావడంతో..

నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి వెళ్లే బస్సులు అన్ని యర్రగొండపాలెం వైపు నుంచి ఇదే రోడ్డు నుంచి హైదరబాద్ వెళ్ళాల్సి ఉండడంతో వాహన చోదకులతో పాటు ప్రయాణికులు అవస్థలుకు గురవుతు న్నారు. వాహనాలు మరమ్మతులకు గురైన సమయంలో ప్రయాణికులు కూడా రాత్రిపూట రోడ్లపై అడవిలో ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉన్నప్పటికీ గతంలో ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మతులు చేస్తారనుకుంటే అదిలేదు. ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్డు కావడంతో అటవీశాఖ అనుమతి లేదని జాతీయ రహదారి అథారిటీ ఇంజనీర్లు మరమ్మతులు చేయడానికి చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన పాలకులైన అడవిలో నిలిచిన 22 కిమీ పొడవునా రోడ్డు నిర్మాణానికి ఆటవీశాఖ అనుమతి మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తారని ప్రకాశం, పల్నాడు జిల్లాలలో ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు ప్రభుత్వానికి కోరుతున్నారు.

కనీసం రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టాలి

షేక్ చిన్నవలి, యండ్రపల్లి

నరజాముల నుంచి శిరిగిరిపాడు వరకు ఉన్న 565 జాతీయ రహదారి సింగిల్ రోడ్డు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అటవీ ప్రాంతంలో ఉండడం, మరమ్మతులకు గురి కావడంతో వాహనదారులు ప్రయాణించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టండి.

22 కిమీ డబుల్ రోడ్డు నిర్మించాలి

వెంకట సుబ్బయ్య, మల్లాపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అనుమతులు లేక సింగిల్ రోడ్డుగా ఉన్న 565 జాతీయ రహదారికి అనుమతులు సాధించాలి. అటవీ ప్రాంతంలో కూడా డబుల్ రోడ్డును వేయాలి. అప్పుడే ఎలాంటి ప్రయాణాలు జరుగకుండా ప్రయాణాలు సాఫీగా జరుగుతాయి.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

తప్పు ఏమీ లేదని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి , పోలవరం నిర్మాణానికి నిధులు గ్రాంట్ల రూపంలో ఇవ్వాలని, అప్పులు కాదని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదన చేశారని, ఇది ఆహ్వానించదగిన విషయమేనని, కానీ ఈ జిల్లాకు నిధుల పరిస్థితి ఏమి చెప్పలేదని విమర్శించారు. రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ జిల్లాకు ప్రకటించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ ఏపీ విభజన జరిగిన తర్వాత రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రం అప్పులు కుప్పగా మారిపోయిందన్నారు. ఏపీ అభివృద్ధి కావాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వడం తప్ప మరో మార్గం లేదన్నారు. కేంద్రం ఇచ్చే అరకొర నిధులతో రాష్ట్ర అభివృద్ధి జరగదన్నారు. ప్రత్యేక హోదా సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరించడం లేదన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కె.మాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రాలు విడుదల చేసి లోటు పేరుతో ప్రజలపై పన్నుల భారాలు మోపితే సహించమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. తొలుత కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సుందరయ్య భవన్ నుంచి కర్నూలు రోడ్డు మీదుగా సాగర్ సెంటర్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, ఉసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, శాఖా కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలినేని పార్టీకి దూరమవుతున్నారా..?

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం.అందుకే ఆ కార్యక్రమానికి వెళ్లలేదని చెబుతున్నారు. పార్టీపై దాడులు జరుగుతుంటే ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోవాలని బాలినేని అభిప్రాయ పడుతున్నారు.అధినేత జగన్ ఏకపక్షంగా తొందర పాటు నిర్ణయాలు తీసు కోవడాన్ని బాలినేని తప్పు పడుతున్నారు. రాజకీయపరిణితి లేకుండా ఆవేశంతో నిర్ణయాలు తీసుకోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని ఆయన సన్నిహితులవద్ద, తనను కలిసిన పార్టీ నేతలవద్ద గుర్తు చేస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే పార్టీకి బాలినేని దూరమవు తున్నారని స్పష్టమవుతోంది. పార్టీని వీడకపోయినా ఆయన క్రియాశీలకపాత్రలో ఉండేలా కనిపించడం లేదు. జిల్లా అధ్యక్షుడి విషయంపై ప్రజాశక్తి బాలినేనిని అడగ్గా తాను జిల్లా అధ్యక్షుడిగా ఉండబోనని..అదే విధంగా ఎవరిని పెట్టాలో కూడా తాను సూచించబోనని వ్యాఖ్యానించారు.

బస్సును తప్పించబోయి.. ట్రాక్టర్ బోల్తా

(మొదటిపేజీ తరువాయి)

వివరాల ప్రకారం.. నగరం మండలం గట్టువారిపాలెం గ్రామానికి 14 మంది ట్రాక్టర్‌పై కొండపాటూరు దైవదర్శనానికి వెళ్తున్నారు. ట్రాక్టర్ యాజలి గ్రామ సమీపం వచ్చేసరికి మలుపు వద్ద బస్సును తప్పించే క్రమంలో చెట్టు కొమ్మలు తగలడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో గట్టు కోటేశ్వరరావు(65),గడ్డం శివ నాగులు(60), గడ్డం లక్ష్మీ(40) అక్కడికక్కడే మృతి చెందారు. 11మందికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని బాపట్ల డిఎస్‌పి మురళీ కృష్ణ, బాపట్ల టౌన్ సిఐ శ్రీహరి, రూరల్ సిఐ హజరత్‌బాబు పరిశీలించారు.

ఎమ్మెల్యే వేగేశన దిగ్భ్రాంతి

ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ హుటాహుటిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు.

ప్రజా సమస్యలపై విశాల ఉద్యమాలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్న భోజనం లాంటి పథకాల్లో పనిచేసే కార్మికులను తొలగించేందుకు రకరకాల వేధింపులకు గురిచేస్తున్నారు, ప్రతిపక్షంలో ఉన్నపుడు మద్దతుగా ఉంటామని చెప్పిన తెలుగుదేశం కూటమి ప్రభు త్వం వేధింపులు పాల్పడం దారుణమన్నారు. అక్రమ తొలగింపులపై సిఐటియు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ప్రజాసంఘాలు భవనం ద్వారా జిల్లాలో కార్మికవర్గ సమస్యలపై పోరాటాలు చేస్తామ న్నారు. తొలుత ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బొనిగల సుబ్బా రావు, ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపిం చారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి కె.రామా రావు, కీర్తిశేషులు దొప్పలపూడి మల్లికార్జునరావు సతీమణి దొప్పలపూడి ప్రమీల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కష్ణమోహన్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్, సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందర్, సిఐటియు నాయకులు ఎన్.బాబూ రావు, రైతుసంఘం నాయకులు రామారావు, వెంకటరామయ్య, యుటిఎఫ్ నాయకుడు ఎ.శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఇతర ప్రజాసంఘాలు నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, తిరుమలరెడ్డి, కె.శరత్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **GUMMALLA VENKATA RAO (Old Name),** S/o. Gummalla Peda Mala Kondaiah, Occupation : Self Employee, Resident of D.No.6-295, Nagireddy Palem, Ponnaluru Mandalam, Prakasam District, Andhra Pradesh -523109. I have changed my name from **GUMMALLA VENKATA RAO** to **GUMMALLA VENAKTARAO** (New Name) **S/o Gummalla Peda Mala Kondaiah,** as per affidavit dated **26/07/2024** before Public Notary, Ongole.

పడకేసిన పారిశుధ్యం

- గ్రామాల్లో కనిపించని పరిశుభ్రత
- వ్యర్థాలతో స్థానికులు ఇబ్బందులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని 19 పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, చెదారం దర్శనమిస్తోంది. దీనికి తోడు ఇటీవల కురిసన వర్షాలకు పలు చోట్ల గుంతలలో వర్షం నీరు నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారాయి. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు ఉన్నప్పటికీ పేరుకుపోయిన చెత్తను తీసేవారు లేకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. కొన్ని చోట్ల రోడ్ల పక్కన గుంతలలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు

కొండపిలోని మండల కార్యాలయం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

కుళ్లిపోయి కంపుకొడుతున్నాయి. గత కొన్ని రోజుల క్రిందట కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ ఏ.కుమార్ కొన్ని గ్రామాలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్యంపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లా అధికారులు, మంత్రులు వస్తున్నప్పుడే రోడ్లుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేస్తున్నారే తప్పా మిగతా సమయాలలో పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న పాపాన పాలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

కనిపించని పారిశుధ్య కార్యక్రమాలు

గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు కానీ, రోడ్డుకు ఇరువైపులా చెత్త నిల్వ ఉన్న ప్రాంతాలను కానీ శుభ్రం చేయడంలో పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు మూలన పడ్డాయి. పారిశుధ్య కార్మికులు కొన్ని చోట్ల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొండపి మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో డ్రైనేజీ కాలువులు లేక రోడ్లపై మురుకు నీరు ప్రవహిస్తున్నా పంచాయతీ కార్యదర్శికి మాత్రం చీమకుట్టినట్లుగా లేదు. వర్షాకాలంలో పారిశుధ్యంపై ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోవడంలేదని గ్రామాల్లో డ్రైనేజీ పనులు అధికారుల ప్రకటనలకే పరిమితం అయ్యాయిన గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు, ఈగలు, వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వ్యాధులు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు లేకపోవడం వల్లనే ఎక్కడ చూసినా పారిశుధ్య కార్మికులకు వాహనం నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని తెలుస్తోంది. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రైనేజీ కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో ముందుకు కదలని మురుగు

పిచ్చి మొక్కలతో అధ్వానంగా కార్యాలయాలు

అలాగే మండల కార్యాలయంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగాయి. వాటిపై అధికారులు దృష్టి సారించలేదు. అధికారుల కార్యాలయాల చుట్టూ పరిశుభ్రత ఇలా ఉంటే గ్రామాల్లో సమస్యలు ఎవరు పట్టించుకుంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సమస్యల కోసం వచ్చే అర్జీదారులకు కార్యాలయాల పక్కన పిచ్చి మొక్కలు ఉండడం చూసి ఇది ప్రభుత్వ కార్యాలయాలా? లేక పాడుబడిన బంగ్లాలా? అని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాలు చుట్టూ చెట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చెట్టుకు వేలాడుతున్న నారాయణరెడ్డి మృతదేహం

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం చినగానిపల్లికి చెందిన కైపా నారాయణరెడ్డి (55) గ్రామానికి సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చినగానిపల్లికి చెందిన నారాయణరెడ్డి జీవనోపాధి నిమిత్తం గుంటూరు వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు కూతురు, కుమారుడు, భార్య ఉన్నారు. రెండు రోజుల క్రితం స్వగ్రామం చిన్నగానిపల్లెకు వచ్చి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మృతి చెందిన గొర్రె పిల్లలు

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం కొంగలవీడులో మునిరాజు కు చెందిన గొట్టెల దొడ్డిలో గొర్రె పిల్లలపై కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయి. మరణించిన గొర్రెల పిల్లల విలువ రూ.లక్షా యాభై వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. గొర్రెలను మేతకు తోలుకుపోతూ గొర్రెల దొడ్డిలో గొర్రె పిల్లలను ఉంచగా కుక్కలు దాడి చేశాయని మునిరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తికి పాముకాటు

ప్రజాశక్తి - చీరాల

తిరుమలకు వెళ్లే అలిపిరి మెట్ల మార్గంలో చీరాలకు చెందిన భక్తుడు నాగేంద్ర ఆదివారం పాముకాటుకు గురయ్యాడు. అందిన వివరాల మేరకు.. నాగేంద్ర అనే యువకుడు తన స్నేహితులతో కలిసి తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో 7వ మైలు దాటిన తర్వాత ఓ టీ స్టాల్ వద్ద పాము కాటుకు గురయ్యాడు. సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు వెంటనే అంబులెన్స్ ద్వారా తిరుమల అశ్విని హాస్పిటల్‌కి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని ఇనమనమెల్లూరు, బసవన్నపాలెం, నందిపాడు, కోవివారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. ఫీడర్‌ల మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ విద్యుత్ కోత ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వివరాలు వెల్లడిస్తున్న తాలూకా సిఐ ఖాజావలి

తప్పించుకున్న నిందితుడు ప్రతాప్ రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో స్పా, మసాజ్ సెంటర్ల తనిఖీలలో భాగంగా పోలీసుల నుంచి తప్పించుకున్న మార్తూరి ప్రతాప్ రెడ్డిని అరెస్టు చేసినట్లు తాలూకా సిఐ షేక్ ఖాజావలి తెలిపారు. స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో తాలూకా సిఐ వెల్లడించిన వివరాల మేరకు.. కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన మార్తూరి ప్రతాప్ రెడ్డి ఈనెల 20న ఒంగోలు పాత గుంటూరు రోడ్, గుప్తాస్ మిడ్ టౌన్ 4వ ఫ్లోర్‌లోని సారా స్పా సెంటర్‌లో నిర్వాహకుడు కిమిడి పవన్ కుమార్‌కు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి అమ్మాయిలతో వ్యభిచారం చేస్తుండగా పోలీసులు తనిఖీలు చేశారు. ముద్దాయిలను అదుపులోకి తీసుకునే క్రమంలో ప్రతాప్ రెడ్డి పోలీసులను నెట్టి వేసి పారిపోయాడు. దీంతో మార్తూరి ప్రతాప్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎస్‌పి ఏఆర్ దామోదర్ పారిపోయిన మార్తూరి ప్రతాప్‌రెడ్డిని పట్టుకోవటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ముద్దాయి మార్తూరి ప్రతాప్ రెడ్డిని ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న ఒంగోలు డిఎస్‌పి కిషోర్ బాబు, ఒంగోలు తాలూకా ఇన్‌చార్జి సిఐ షేక్ ఖాజా వలి, ఒంగోలు తాలూకా ఎస్సై ఎం.విజయ్‌కుమార్, క్రైం పార్టీ కె.రామకృష్ణ, ఆర్.రాంబాబు, కె.రవికుమార్‌ను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ అభినందించారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

పార్టీలో చేరిన వైసీపీ వార్డు సభ్యురాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ, వాలంటీర్ల శాఖ మాత్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం శింగరాయకొండకు చెందిన వైసీపీ వార్డు సభ్యురాలు పొట్లూరు సునీత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు మంత్రి స్వామి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. సుందర్‌నగర్‌ని అభివృద్ధి చేసింది అప్పటి మంత్రిగా పని చేసిన దామచర్ల ఆంజనేయులు అని తర్వాత తాను ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులు, గిరిజనలు, బీసీ, మైనార్టీల విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాల ఉంటే ఆ పాఠశాలను తొలగించడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాలు పాటు పాఠశాల లేక విద్యార్థులు విద్యకు దూరమైతే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే సుందర్‌నగర్ కాలనీలో పాఠశాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ పాఠశాలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడతామన్నారు. తాగునీరు పూర్తి స్థాయిలో అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ సంధాని భాష, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కష్ణ, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనావుల్లా, సుదర్శి ప్రసాదరావు, మించల బ్రహ్మయ్య, ఇమ్మడిశెట్టి రామారావు, షేక్ యస్దాని దేపూరి కొండలరావు, యాదగిరి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్లూరి సునీతని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి స్వామి

టీడీపీలో చేరిన పొన్నలూరు సర్పంచి

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు సర్పంచి పాలపర్తి శాంతి, పలువురు వైసీపీ నాయకులు ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. 9 వార్డు మెంబరు లింగంగుంట నరసింగరావు, పాలపర్తి పెద అంజయ్య తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, జిల్లా తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి మండవ మురళి, మండవ వెంకటేశ్వర్లు, ఐటిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మండవ వెంకటేష్, బీసీ నాయకులు కంచర్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.



పొన్నలూరులో టీడీపీలో చేరిన నాయకులతో మంత్రి స్వామి

పర్యాటక అభివృద్ధిపై తప్పుడు ప్రచారం

- తీరప్రాంతాల్లో సుడిగాలి పర్యటన
- పర్యాటకుల భద్రత ఏర్పాట్లను ఎమ్మెల్యేను పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

తీర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి చేయాలానే సంకల్పంతో తాను తీసుకున్న నిర్ణయాలపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అయినా సరే అభివృద్ధి లక్ష్యంగా అందరిని సమన్వయం చేస్తూ మంచి నిర్ణయాలతో ముందుకు వెళుతూన్నాని ఎంఎల్‌ఎ కొండయ్య అన్నారు. వాడరేవు, రామాపురం తీర ప్రాంతాల్లో ఆయన ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. బీచ్‌ల వద్ద జరుగుతున్న వరుస ప్రమాదాలను అరికట్టేందుకు అమలు చేస్తున్న నూతన ఆంక్షలు గురించి పర్యాటకుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. పర్యాటకులు సముద్రంలో గల్లంతై ప్రాణాల కోల్పోతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వాడరేవు, రామాపురం, కటారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెంలో ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నామని, పర్యాటకులు సహకరించాలని కోరారు. మద్యం సేవించడం సముద్ర స్నానానికి వెళ్లవద్దని అన్నారు. సముద్రంలో గుంటలు ఉన్నందున దూర ప్రాంతాల నుండి వచ్చిన పర్యాటకులు అవగాహన లోపంతో ప్రమాదాల బారిన పడి యువత అధికంగా

తీరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా గజ ఈతగాళ్లను, ప్రమాదాల సూచిక బోర్డులు, పోలీసులను సముద్రం వద్ద అందుబాటులో ఉంచామన్నారు. కేవలం పర్యాటక రంగం అభివృద్ధి చేయాలానే సంకల్పంతో చేపడుతున్న ఈ నిర్ణయాలపై కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఎన్ని విమర్శలు చేసినా అభివృద్దే లక్ష్యంగా ముందుకెళ్తానన్నరు. ప్రమాదాలను అరికట్టెందుకు సముద్ర తీరంలో తీసుకున్న చర్యలపై పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల 1988-89లో టైటాన్స్ బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిజాంపట్నం హార్బర్ బీచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ బీచ్‌లో సందడి చేశారు. ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ గత స్మృతులను నెమరువేసున్నారు. తమ విద్య, ఉద్యోగ, వైవాహిక, జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల గురించి ఒకరికొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకు న్నారు. ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. వారంతా ఎంతో ఉత్సాహంతో తమ కుటుంబాలతో సహా ఒక్కచోట చేరి తమ స్మృతులను పంచుకోవడం ఎంతో సంతోషాన్ని నింపిందని చెప్పారు. తామంతా ఎప్పుడూ ఇలాగే కలిసి ఉంటూ ఉన్న జీవితాన్ని సంతోషంగా గడు పుతూ మన టైటాన్స్ బ్యాచ్ ద్వారా ఆపదలో ఉన్నవారికి తగిన సహాయ, సహకారాలు చేద్దామని నిర్ణయించు కున్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుదామని చెప్పుకున్నారు. తొలుత తమ బ్యాచ్‌కి చెందిన స్నేహితుడు పీతా హరిబాబు

పూర్వ విద్యార్థుల కలయిక

అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన ఇద్దరు కుమార్తెలకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రూ.లక్ష పోస్ట్ ఆఫీసులో డిపాజిట్ చేసి ఆ పత్రాలను పీతా హరిబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రసాదం వాసుదేవ, నర్రా నాగేశ్వరరావు, అబ్దుల్ సలీం, నజీర్, షేక్ మౌలాలి, మోపిదేవి నాగరాజు, పీత సుబ్బారావు, మెండు వెంకట రత్నారావు, నాయుడు వెంకటేశ్వరరావు, ఎన్ మల్లికార్జునరావు, సరళ కుమార్, గీతా వాణి, శ్రీలలిత, నాగమణి, పద్మజ, భవాని, అలియాబి, ఈసూబ్ బేగ్, మరకా శ్రీనివాసరావు, ఆలపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫు జాతీయ టోర్నమెంట్లో సిల్వర్ మెడల్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

హైదరాబాద్ జన సంఘం రెడ్డి ఫంక్షన్ హాలులో షావలిన్ కుంగ్ ఫూ జాతీయ టోర్నమెంటు నిర్వహించారు. టోర్నమెంట్‌కు భట్టిప్రోలు మాతా కాన్వెంట్ నుండి విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. సిల్వర్ మెడల్ సాధించారు. తమ కాన్వెంట్ విద్యార్థి కె ప్రభాకరరావు సిల్వర్ మెడల్ సాధించటం పట్ల పాఠశాల కరస్పాండెంట్ రవితేజ విద్యార్థితోపాటు కోచ్ కౌతరపు

సిల్వర్ మెడల్ అందుకుంటున్న ప్రభాకరరావు

గోపీని అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన అండర్ 15 విభాగంలో ప్రభాకరరావు సిల్వర్ మెడల్ సాధించటం గొప్పగా ఉందన్నారు. కుంగ్ ఫు, కరాటేలో గతంలో భట్టిప్రోలు నుండి అనేక మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు సాధించినట్లు పేర్కొన్నారు.

వాడరేవు ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో ఉచిత షుగరు వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 1007 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెలకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. క్యాంపులో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్ యాదవ్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి

వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, దుర్గగుడి శీను, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు సహాయక ఏర్పాట్లు చేశారు.

తరిమెల నాగిరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

విప్లవ కమ్యూనిస్టు తరిమిల నాగిరెడ్డి

ప్రజాశక్తి - రేపల్లె

భారత విప్లవోద్యమ ప్రముఖ నాయకులలో ఒకరైన కామ్రేడ్ తరిమిల నాగిరెడ్డి 48వ వర్ధంతిని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లో ఆదివారం నిర్వహించారు. సిపిఐ ఎంల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మేకల ప్రసాద్ మాట్లాడుతూ సామ్రాజ్య వాదులకు 49ఏళ్ల క్రితమే భారత దేశం తాకట్టు పెట్టబడిం దని నాగిరెడ్డి చెప్పారని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటిఒ, ఐఎంఎఫ్ విధానాలు అమలవు తున్నాయని అన్నారు. ఈ విధానాల వలన వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని అన్నారు. పేదలు నిరుపేదలుగా మారిపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో తలపల మల్లయ్య, టి శినాగులు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు శివపార్వతి, సిహెచ్ చెంచయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే కొండయ్యకు సన్మానం

ప్రజాశక్తి - వేటపాలెం

ఎంఎల్‌ఎ కొండయ్యను ఆత్మీయంగా ఆదివారం సన్మానించారు. గజమాలతో సత్కరించారు. ఎంఎల్‌ఎ కొండయ్య మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంలో చేనేతకు మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. చేనేత కార్మికుల ఉపాధికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధిగా పనిచేస్తుందని అన్నారు. చేనేత ఉప వృత్తుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో చీరాలలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత, నాసిక వీరభద్రయ్య, పందిళ్లపల్లి గ్రామ అధ్యక్షులు బాలచందర్, లింగమూర్తి, గుత్తి వీరాంజనేయులు, ఒలుకుల బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు

బహుమతిని సాధించిన లుక్కా సుబ్బారావు

ఆర్‌టిసి క్రీడా పోటీల్లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆర్టీసీ ఉద్యోగుల క్రీడా పోటీలు నెల్లూరులో శనివారం జరిగాయి. పోటీల్లో రేపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ లుక్కా సుబ్బారావు 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన (729700) నంబర్ కలిగిన డ్రైవర్ సుబ్బారావు జోనల్ పోటీల్లో సాధించిన బహుమతితో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. చీరాల, రేపల్లె ఆర్టీసీ డిపోల నుండి వివిధ పోటీల్లో మూడు బహుమతులు సాధించినట్లు తెలిపారు. ఉన్నత అధికారుల నుండి అవార్డులు అందుకోవటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నవీన్

బధిరుల పాఠశాల్లో నవీన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

స్థిరాస్తి వ్యాపారి గంటా నవీన్ జన్మదిన వేడుకలు వెదుళ్ళపల్లి ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాలలో చిన్నారుల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. నవీన్ ఫ్రెండ్స్ సర్కిల్ కాలేషా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నాయకులు గంటా అంజిబాబు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధి పట్ల అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

ఆరోగ్య అధికారి విజయమ్మ

హెపటైటిస్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడారు. వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాధి సోకి ఏడాదికి 1.34 మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అసురక్షత లైంగిక సంపర్కంతో ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. హెపటైటిస్ బారిన పడిన తల్లి నుండి నవజాత శిశువుకు వ్యాధి రాకుండా ఉండేందుకు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ప్రసవ సమయంలో హెబటైటిస్ బి ఇమినోగ్లోబిలిన్ వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చని అన్నారు. ప్రజలు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మాధవరావు దంపతులను సన్మానిస్తున్న రాంబాబు

డిస్టెన్స్ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం డిస్టెన్స్ డైరెక్టర్‌గా వంకాయలపాటి వెంకటేశ్వర్లును నియమించటం విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల రిటైర్డ్ ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేసిన తోటకూర మాధవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వద్ద చదువుకొని ఉన్నత విద్య అభ్యసించి నాగార్జున విశ్వ విద్యాలయంలో సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ వంకాయలపాటి వెంకటేశ్వరరావుకు డిస్టెన్స్ డైరెక్టర్‌గా ప్రభుత్వ నియమించినందుకు అభినందనలు తెలిపారు. ఆయన నియామకంపై సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రంలో పరిశోధన చేస్తున్న తెళ్ళ రాంబాబు విశ్రాంత అధ్యాపకులు తోటకూర మాధవరావు దంపతులను ఆదివారం శాలువాలతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- రేపల్లె

పట్టణంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు 11కెవి లైన్ నిర్వహణ నిమిత్తం గరువురోడ్, లక్ష్మీ టాకీస్ సెంటర్ నుండి బేతపూడి సెంటర్ వరకు రోడ్డుకు ఉత్తరం వైపు, జెఎల్‌బి కాలేజ్ రోడ్, బేతపూడి గ్రామ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ సరఫరా అంతరాయం కలదని ఎఇ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేతనం అందక..పూట గడవక..

- ఉపాధి కూలీల అవస్థలు
- మూడు నెలలుగా అందని డబ్బులు
- కూలీలకు తప్పని పస్తులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉపాధి హామీ చట్టం కింద యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో పనులు చేసిన కూలీలకు మూడు నెలలుగా వేతనం అందలేదు. దీంతో వారు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పూట గడవక ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లినా అక్కడ కూడా పనులు దొరకడం లేదు. స్థానికంగా వ్యవసాయ పనులు సాగక ఉపాధి పనులపైనే ఆధారపడి కూలీలు జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగగానే ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో పని చేసిన వారిని తొలగించి అధికార పార్టీకి అనుకూలమైన వారిని నియమించుకునే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. పనులు చేసినా గత మూడు నెలలుగా వేతనం మంజూరు కాకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలో..

యర్రగొండపాలెం మండలంలో 18,680, పుల్లలచెరువు మండలంలో 19,352, త్రిపురాంతకం మండలంలో 16,950, పెద్దారవీడు మండలంలో 12,866, పెద్దదోర్నాల మండలం లో 13,435 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. చేసిన పనులకు యర్రగొండపాలెం మండలంలో రూ. 2,84,17,833 వేతనం కూలీలకు అందాల్సి ఉంది. పెద్దదోర్నాల మండలంలో రూ.3, 50,25,041, పెద్దారవీడు మండలంలో రూ.3,98,16,606, పుల్లలచెరువు మండలంలో రూ. 3,65,31,707,త్రిపురాంతకం మండలంలో రూ. 2,84,17,833 వేతనం కూలీలకు అందాల్సి ఉంది. ఉపాధి పనులు చేసిన కూలీలకు ప్రతి వారం డబ్బులు చెల్లించాలి. ఒకవేళ ఆలస్యం అయినా గరిష్టంగా 15 రోజుల్లో ఇవ్వాలి. ఆ తర్వాత చెల్లిస్తే వడ్డీతో సహ జమ చేయాలని చట్టం చెబుతోంది. పనులు చేసి నెలలు గడిచినా వేతనాలు అందకపోవడంతో కూలీలు తల్లడిల్లుతున్నారు. మండల కేంద్రాల్లోని ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నిధులు విడుదల చేయని కేంద్రం..

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడం వల్లే కూలీలకు చెల్లింపులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఇతర పథకాలకు వినియోగించుకోవడంతో సకాలంలో కూలీలకు డబ్బులు అందడం లేదని కేంద్ర ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో కూలీలు మండిపడుతున్నారు.

కూలీలకు తప్పని అగచాట్లు..

ఉపాధి పనులు చేసినా సకాలంలో డబ్బులు రాక పోవడంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పని చేసిన డబ్బులతోనే కుటుంబాలను నెట్టుకొచ్చే కూలీలే అధిక శాతం మంది ఉన్నారు. డబ్బులు అందక అయిన కాడికి అప్పులు చేస్తున్నారు. గ్రామాల్లో చిల్లర సరుకుల దుకాణాల వద్ద అప్పు చేసి సరుకులు తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. సొంత గ్రామంలో పనులు కల్పిస్తామని అధికారులు చెప్పిన మాటలు నమ్మి పనులకు వెళ్తే సకాలంలో కూలీ చెల్లించడంలో విఫలమయ్యారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేతనం అందక ఇబ్బందిగా ఉంది

షేక్ చిన్న వలి, ఉపాధి కూలీ, యర్రగొండపాలెం

వేసవిలో ఉపాధి పనికి వెళ్లా. వారం డబ్బులే వచ్చాయి. మిగతా డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. వేతనం అందక చాలా ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి కార్యాలయం దగ్గరకు వెళితే ఎప్పుడు వస్తాయో తమకే తెలియదంటున్నారు. ఉపాధి వేతనం మంజూరు

కూలి డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలి

పులిగుజ్జు పుల్లయ్య, ఉపాధి కూలీ, యర్రగొండపాలెం

మేలో ఉపాధి పనులకు వెళ్లాను. ఒక వారం డబ్బులే వచ్చాయి. మిగతా డబ్బు రాలేదు. మూడు వారాలవుతున్నా బకాయి డబ్బులు రాలేదు. నెలకు వచ్చే ఐదు కేజీల బియ్యం, ఉపాధి కూలీ డబ్బులతోనే బతుకుతున్నాను. డబ్బులు వస్తే బాకీ తీరుస్తానని చెప్పి మూడు నెలలుగా అప్పులు చేస్తున్నాను. ప్రభుత్వం వెంటనే కూలి డబ్బులు ఇప్పించాలి.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

సత్యం రాజు

ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సత్యం రాజు కోరారు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, రేడియోగ్రాఫర్, ఆప్తాలమిక్ అసిస్టెంట్, థియేటర్ అసిస్టెంట్, కాంట్రాక్టు ఉద్యోగులకు నూరు శాతం వేతన విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మంత్రి లోకేష్‌కు ఈ మెయిల్ ద్వారా ఆదివారం సందేశం పంపినట్లు ఆయన తెలిపారు. నూరు శాతం గ్రాస్ అమలు చేయాలని కోరారు. 500మంది కాంట్రాక్టు ఉద్యోగులకు బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు. ఒకే క్యాడరు ఉద్యోగులను మరొక క్యాడర్ ఉద్యోగులతో ప్రమోషన్ విధానంలో భర్తీ చేసే చర్యలు పూర్తిగా సమర్థనీయం కాదన్నారు. ప్రభుత్వం ఎఎన్ఎంలు, స్టాఫ్ నర్స్ ఉద్యోగాల్లో ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలనే ప్రతిపాదనలు పూర్తిగా విరమించుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ ప్రతిపాదన జీవోను నిలిపివేస్తున్నామని పత్రికల ద్వారా ప్రకటన ఇవ్వడంతో స్టాఫ్ నర్సులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికి ఆటోమేటిక్‌గా ప్రతి ఐదేళ్ళ కొకసారి రెగ్యులర్ అయ్యే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈ దష్టి సారించి సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - కొత్తపట్నం

కొత్తపట్నం గ్రామంలోని నాంచార్మ తల్లి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ఎండ్ల బండ్లను సుందరంగా అలంకరించి అమ్మవారికి పసుపు, కుంకమ సమర్పించారు. ఎడ్ల బండ్లను తిలకించేందుకు చట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు.

ఆక్రమణల చెరలో రాళ్లవాగు

- రోజు రోజుకూ పెరుగుతున్న కబ్జా
- ఆక్రమించి అక్రమ కట్టడాలు
- కాలువలా మారిన వాగు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణానికి ఉత్తరం వైపున ఉన్న రాళ్లవాగు పోరంబోకు ఆక్రమణకు గురవుతోంది. వాగు భూమిని కొంతమంది ఆక్రమించి యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నారు. మరి కొంత మంది ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించేందుకు బేస్ మట్టాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే ఆక్రమించి పట్టాలు పొందుతునానరు. అనంతరం రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టడం ఇక్కడ రివాజుగా మారింది. ఆక్రమణకు గురైన ప్రాంతంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అవి అలంకార ప్రాయంగానే మిగులు తున్నాయి. కొన్ని రోజులకు ఆ బోర్డులను ఆక్రమణదారులు తొలగించి వేస్తున్నారు. రాళ్లవాగు వెంబడి ఉన్న పట్టా భూముల సర్వే నెంబర్లతో వాగు భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆ భూమిని అనువంశీకంగా చూపి రూ. లక్షల్లో విక్రయిస్తున్నారు.

రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

ఆక్రమణ ఇలా..

యర్రగొండపాలెం-గంజివారిపల్లె రోడ్డులోని చప్టా వద్ద నుంచి మురారిపల్లి పెద్దచెరువు వరకూ నాలుగు సర్వే నెంబరుల్లో 77.31 ఎకరాల వాగుపోరం బోకు భూమి ఉంది. సర్వే నెంబరు 28/1లో 44.09 ఎకరాలు, సర్వే నెంబరు 587/2లో 22.04 ఎకరాలు, సర్వే నెంబరు 588/1లో 5.62, సర్వే నెంబరు 588/4లో 5.56 ఎకరాలు భూమి వాగు పోరంబోకుగా ఉంది. ఆక్రమణదారులు రాళ్ళవాగుకు ఇరువైపుల ఆక్రమించారు.

రాళ్లవాగు స్థలంలో వెలసిప బేస్‌మట్టం

దీంతో వాగు కుచించుకుపోయింది. మొత్తం 77.31 ఎకరాలకు కేవలం 30 ఎకరాలు మాత్రమే మిగిలి రాళ్లవాగు చిన్న కాలువగా కనిపిస్తోంది. రాళ్లవాగు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు ప్రభుత్వం అనుమతి లేకుండా ఎక్సకవేటర్లతో త్రవ్వి టాక్టర్లు ద్వారా గ్రావెల్ తరలిస్తున్నారు. దీంతో వాగులో పెద్ద, పెద్ద గోతులు తవ్వారు. రాళ్లవాగు హద్దు భూములు క్రయ, విక్రయాలు జరిగి కొనుగోలు చేసిన వ్యక్తులు నష్టపోతున్నారు. పుల్లలచెరువు రోడ్డులో రాళ్లవాగు సరిహద్దు భూమిలో ఆక్రమణదారులు బేస్ మట్టాలు నిర్మించారు. 2022లో రెవెన్యూ అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డులు సైతం ఆదశ్యమయ్యాయి.

పట్టించుకోని అధికారులు..

రాళ్లవాగులో ఆక్రమణలు జరుగు తుండడంతో 2022 ఏప్రిల్‌లో అప్పటి మార్కాపురం ఆర్‌డిఒ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించారు. ఆక్రమణలు తొలగించాలని ఆర్‌డిఒ అదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేదు. దీంతో ఆక్రమణ తొలగింపులో అధికారులు మీనమీషాలు లెక్కిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ, చిన్ననీటి పారుదల శాఖాధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ రెండు సంవత్సరాలుగా కాలం వెల్లదీస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొంత కాలానిరి రాళ్లవాగు పూర్తిగా కనుమరుగైపోవడం ఖాయం అవుతుంది.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న నరేంద్ర వర్మ

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - బాపట్ల

కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద ఆదివారంజరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందిన ఘటనలో గాయపడి స్థానిక ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, జాయింట్ కలెక్టర్ సుబ్బా రావు, మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్‌తో కలిసి పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని నరేంద్ర వర్మ భరోసా ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని మరోసారి రహదారి మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణకు సూచించారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న అనగాని శివప్రసాద్

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నగరం

కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు మృతి చెందడంపట్ల మంత్రి అనగాని సత్య ప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ హుటాహుటిన బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో గట్టు కోటేశ్వరరావు (65), గడ్డం శివనాగులు (60), గడ్డం లక్ష్మి (40) మృతి చెందారు. 11మంది గాయపడ్డారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.25వేల చప్పున ముగ్గురికి రూ.75వేలు, గాయపడిన ఒక్కొక్కరికి రూ.5వేల చప్పున 11మందికి రూ.55వేలు అనగాని శివప్రసాద్, జనసేన నాయకులు మత్తి భాస్కర్, డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య అందజేశారు.ధ

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కర్లపాలెం

స్థానిక పాత ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న షేక్ నబి ఈ నెల 26న రెండవ అంతస్తు బిల్డింగుపైన పని చేస్తూ ప్రమాదవశాత్తూ కరంట్ షాక్ తగలడంతో అక్కడికి అక్కడే కింద పడి గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మికుల యూనియన్ తరుపున ఆర్థిక సాయం అందించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా మాట్లాడుతూ యూనియన్‌లో సభ్యత్వం కట్టిన వారికి యూనియన్ తరుపున ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా, పఠాన్ జలీల్ ఖాన్, శవనం కోటిరెడ్డి, హాంధులి, సయ్యద్ సుభాని, తుమ్మా ఉల్లారెడ్డి, సుభాని, ఇబ్రహీం, ఫిరోజ్, సాజిద్ పాల్గొన్నారు.

పాల ట్యాంకర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

అద్దంకి, దర్శి ప్రధాన రహదారిలో పోలవరం వద్ద పాల వాహనం స్కూటీ ఢీ కొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎస్‌కె ఖాజావలి తన ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళుతుండగా అద్దంకి వైపు నుండి పోలవరం వస్తున్న పాల ట్యాంకర్ ఢీ కొట్టడంతో అతనికి తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. దీంతో సమాచారం అందుకున్న 108 వాహనం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. పరిస్థితి పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

పరిమళించిన మానవత్వం

ప్రజాశక్తి - పంగులూరు

చిన్నారులను "చిగురు"ఆశ్రమంలో చేర్చిన దృశ్యం

తల్లి మానసిక వికలాంగురాలై ఆసుపత్రిలో మరణించింది. తండ్రి రెక్కల కష్టంపైనే ఆరుగురు పిల్లలను పెంచలేకపోవటం చూసిన గ్రామస్థుల మనసు కలచివేసింది. ఆకలితో అలమటించే వారెవరూ తమ గ్రామంలో ఉండకూడదని భావించారు. ప్రతి ఒక్కరూ తిండికి లోటు లేకుండా బ్రతకాలని ఆ గ్రామ ట్రస్ట్ తీర్మానించుకుంది. తమ ఊరు, తమ ప్రాంతం వారు కాకపోయినా ఆ గ్రామంలో బ్రతుకుతున్న వారంతా ఆ గ్రామ ప్రజలేనని, వారంతా తమ వారేనని భావించారు. ఆకలితో అలమటిస్తున్న ఆ చిన్నారులకు ఆకలి లేకుండా మంచి భవిష్యత్తు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అందులో ముగ్గురు చిన్నారులను కృష్ణానది తీరం పక్కన కరకట్ట రోడ్డులో ఉన్న 'చిగురు' ఆశ్రమంలో చేర్చారు. ఈ ఆశ్రమంలో వారి జీవితాలు చిగురించాలని, వారి జీవితాలకు ఒక వెలుగు దివ్వె కావాలని రామకూరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కోరారు.

మండలంలోని రామకూరులో మహారాష్ట్రకు చెందిన దేవా, దేవి అనే దంపతులు 15ఏళ్ల క్రితం వచ్చారు. గ్రామానికి దూరంగా ఉన్న కొండ దగ్గర క్రషర్ పనుల్లో చేరి ఆరుగురు పిల్లలను కన్నారు. మానసిక వికలాంగురాలైన దేవి ఏడోసారి గర్భం దాల్చింది. కాన్పు సమయంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత ఫిబ్రవరి 17న మరణించిన విషయం ప్రజాశక్తి పాఠకులకు తెలిసిందే. తల్లి చనిపోగా ఆరుగురు పిల్లలకు, తండ్రికి 10ఏళ్ల చిన్నారి లక్ష్మి అన్ని తానై కట్టెపుల్లలు ఏరుకొచ్చి అన్నం వండి పెట్టటం, పిల్లలకు స్నానాలు చేయించడం, వారి ఆలనా పాలన చూడటం అన్నీ ఆమె భుజస్కందాలపై వేసుకుంది. ఈ విషయం గత ఫిబ్రవరి 16న ప్రజాశక్తి కథనం ప్రచురించింది. పిల్లల కష్టాలు తెలుసుకున్న రామకూర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆ పిల్లల ఆలనా పాలన విషయం చూడాలని భావించింది. వారికి చదువులు చెప్పించి మంచి భవిష్యత్తు ఇవ్వాలని అనుకున్నారు. అప్పటి నుండి వారికి కావలసిన బట్టలు, ఇతర అవసరాలను దాతల సహకారంతో ట్రస్ట్ ద్వారా చేయిస్తున్నారు. ఆరుగురు పిల్లలను కేవలం కూలి ద్వారా పెంచలేని తండ్రి పరిస్థితి చూసి చెల్లించిపోయారు. రామకూరు గ్రామానికి చెందిన గౌతమి ఎస్‌ఐగా నరసరావుపేటలో పనిచేస్తుంది. ఆమె చొరవతో రామకూరు పంచాయతీ ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్ సహకారంతో కృష్ణానది కరకట్ట రోడ్డులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటికి దగ్గరలో ఉన్న 'చిగురు' ఆశ్రమంలో ముగ్గురు పిల్లలను ఆదివారం చేర్పించారు. రామకూరు ఉప సర్పంచ్ పేడవల్లి అశోక్, కొంతమంది సభ్యులు ఆదివారం పిల్లలను తీసుకెళ్లి ఆశ్రమంలో చేర్పించారు. ఆశ్రమ వాతావరణం అక్కడ ఉన్న పరిస్థితులు తమకు బాగా నచ్చాయని, ఈ పిల్లల భవిష్యత్తును అక్కడ చక్కగా తీర్చిదిద్దుతారని భావిస్తున్నారు. తల్లి, దండ్రుల ఆదరణకు నోచుకోని పిల్లల పట్ల రామకూర్ చారిటబుల్ ట్రస్టు చూపుతున్న ఆదరణ అభినందదనీయం.

రామయ్య సాహసమే ఉద్యోగులకు స్ఫూర్తి

లైన్‌మెన్ రామయ్యను అభినందించిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

అల్లూరి జిల్లాలో వాగు ఉధృతితో తీగపై వెళుతున్న లైన్‌మెన్

సంక్షోభం నుంచి అవకాశాలు అందిపుచ్చుకోవడం తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు నుంచి నేర్చుకున్నామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఇందుకు లైన్‌మెన్ రామయ్య చేసిన సాహసమే ప్రత్యక్ష ఉదాహరణని కొనియాడారు. ప్రజావసరాలను తీర్చడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మరోసారి నిరూపించామని చెప్పారు. భారీ వర్షాలకు అల్లూరి జిల్లా సున్నంపాడు, దేవరపల్లికి విద్యుత్ నిలిచిపోయింది. అక్కడి ప్రజలు బాహ్య ప్రపంచంతో ప్రజాసంబంధాలను కోల్పోయారు. ఈ తరుణంలో ఎపిఈపిడిసిఎల్ పరిధిలో పని చేస్తున్న లైన్‌మెన్ కూర రామయ్య వరద ఉధృతిని లెక్క చేయకుండా విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యంగా తీగలపై నడుచుకుంటూ వాగు దాటి విద్యుత్ సేవలు అందించారు. విధి నిర్వహణలో రామయ్య చూపిన సాహసం, తెగువ అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఇది ఎంతో మంది ఉద్యోగులకు ఆదర్శమని అన్నారు. మరెంతో మందిలో చైతన్యం నింపుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ట్విట్టర్లో ట్వీట్ చేశారు.

ట్రాన్‌ఫార్మర్లు పగులగొట్టి రాతితీగ చోరీ

ప్రజాశక్తి - అద్దంకి

చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

మండలంలోని రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లు గడిచిన సంవత్సర కాలంలో సుమారు 40చోరీ అయ్యాయి. విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్స్ పరిధిలోని వ్యవసాయ బోర్ల ఆధారంగా రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. ట్రాన్స్ ఫారమ్స్ చోరీ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూరిమెట్ల ఉమామహేశ్వరపురం, తమ్మలూరు, పోలవరం, పెద్ద రావిపాడు, ముండ్లమూరు, నూజిల్లపల్లి, పసుపుగల్లు, రెడ్డినగర్, లక్ష్మీనగర్, పులిపాడు, మారెళ్ళ గ్రామాల్లో విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఆయా గ్రామాలకు చెందిన రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి కాపీలు ఇవ్వడానికి రైతులను పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతూ రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లు చోరీ చేసిన దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఇటీవల వచ్చిన ఎస్పీ ఎఆర్ దామోదర్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీ జరిగిన విషయం తెలుసుకొని పాత నేరస్తులను పట్టుకొని కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. పీడీ యాక్ట్ అమలు చేయాలని చెప్పారు. చోరీ అయిన ట్రాన్స్ ఫార్మర్లు రికవరీ చేసి రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అదే రోజున వేంపాడు గ్రామానికి చెందిన మేదరమెట్ల కొండలరావు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైందని చెప్పారు. ఆదివారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో విద్యుత్తు ఎఈ వీరబ్రహ్మం మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 40 ట్రాన్స్ ఫార్మర్లు చోరీకి గురైపట్లు తెలిపారు. రైతులు చోరీకి గురైన ట్రాన్స్ ఫార్మర్లు తెచ్చుకోవాలంటే పోలీసులు, విద్యుత్తు కార్యాలయాల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, విద్యుత్ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ల దొంగలను పట్టుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన దూదేకుల మొగులమ్మకు, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన స్వర్ణాల శ్రీనివాసరావుకు మధ్య వివాహేతర సంబంధంతో ఇరువురు కాపురం చేస్తున్నారు. వారిరివురు ఇటీవల సంతమాగులూరు వచ్చి ఒక ఇంటిలో కాపురం పెట్టారు. మొగులమ్మ సంతమాగులూరులోని బాలాజీ ప్రైవేట్ పాఠశాల్లో వంట మనిషిగా పనిచేస్తోంది. స్వర్ణాల శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుకి శనివారం అర్ధరాత్రి గుండె నొప్పితో బాధపడుతూ మృతి చెందాడని మొగులమ్మ తెలిపారు. ఈ విషయం తెలిసిన మృతుడు శ్రీనివాసరావు భార్య స్వర్ణాల లక్ష్మీ కుమారి ఆదివారం ఉదయం తన భర్త గుండె పోటుతో చనిపోలేదని, అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పిర్యాదుపై విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

సాగర్ జలాలతో నిండుతున్న చెరువు

ప్రజాశక్తి - యద్దనపూడి

ప్రజల ద్రాహార్తి తీర్చేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు యద్దనపూడి చెరువులకు చేరుతున్నాయి. బొబ్బేపల్లి సాగర్ కాలవ నుంచి యద్దనపూడి చెరువుకు పైప్ లైన్లు లేనందున దండుదారి వద్ద నుంచి సాగర్ జలాలు చెరువుకు చేరుతున్నాయి. అయితే కాలువ సక్రంగా లేకపోవడంతో నీరు పూర్తిస్థాయిలో రావటం లేదు. నీటి ప్రవాహం వస్తే యద్దనపూడి చెరువు పూర్తిస్థాయిలో నిండాలంటే కనీసం రెండు నెలలు పడుతుందని గ్రామస్తులు తెలిపారు. అప్పటివరకు సాగర్ జలాలు వస్తాయా, రావా అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ప్రజలకు నీటి కష్టాలు మాత్రం తీరటం లేదు. నీటి కష్టాలు తీరాలంటే పూనూరు వద్దగల సాగర్ కాలువ నుంచి యద్దనపూడి చెరువుకు గన్నవరం గ్రామం మీదగా నూతన పైపులైను ఏర్పాటు చేస్తే ప్రతి ఏడాది తాగునీటి కష్టాలు తీరతాయని గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు కలుగజేసుకొని దశాబ్దల నాటి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ

హామీలు అమలు చేయకుంటే ఆందోళన

ప్రజాశక్తి - అద్దంకి

శాసనసభ ఎన్నికల సమయంలో టిడిపి కూటమి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలతో కలిసి పోరాటాలు చేయక తప్పవని సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత సమావేశం వల్లపు నరసింహా అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. జిల్లాలో తాగునీరు, సాగునీరు ప్రాజెక్టులు అనేకం ఉన్నాయని అన్నారు. వీటి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు రెండేళ్ల క్రితం కొట్టుకుపోయినప్పటికీ ఇప్పటివరకు బిగించలేదని అన్నారు. కొరిసపాడు ఎర్రం చిన్న పోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. ప్రత్యేక హెూదా కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు కెఎల్‌డి ప్రసాద్, ఖాదర్ భాషా,

చెరువు వుకట్టపై పెరిగిన దుబాయ్ టేకు చెట్లు

ఊర చెరువు కట్టపై చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని నాగండ్లలో ఊర చెరువు కట్టపై వేపుగా పెరిగిన దుబాయ్ టేకు చెట్లను గత రెండు రోజుల నుంచి తొలగిస్తున్నారు. మూడేళ్ల క్రితం సర్పంచి కంచర్ల పద్మావతి ఆధ్వర్యంలో చెరువు కట్ట శుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండేందుకు దుబాయ్ టేకు చెట్లను నాటారు. అయితే అవి పర్యావరణానికి హానికరమైన చెట్లుగా అధికారులు గుర్తించి ఇటీవల అన్ని గ్రామాల్లో, రోడ్ల వెంబడి, చెరువు కట్టలపైన నాటిన చెట్లను తొలగిస్తున్నారు. అందులో భాగంగా గత మూడేళ్లుగా నాగాండ్ల ఊర చెరువు కట్టపై ఏపుగా పెరిగిన దుబాయ్ టేకు చెట్లను తొలగిస్తున్నారు. పంచాయితీలో బహిరంగ వేలం నిర్వహించి, వేలంలో పాట దక్కించుకున్న వారిచే చెట్ల తొలగింపు పనులు చేయిస్తున్నట్లు సర్పంచి పద్మావతి తెలిపింది.

వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడు మాజేటికి ఘన సన్మానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు మాజేటి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఐక్య ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు, యుటిఎఫ్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు దంపతులకు పుష్పగుచ్చాలు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో వెంకటేశ్వరరావు సేవలు ఆదర్శమని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన భావి జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పాల్గొన్నారు.

క్షతగాత్రులకు వేగేశన పరామర్శ

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని పెద్దపల్లి పంచాయతీ శివారు గట్టువారిపాలెంకు చెందిన గట్టు వెంకటేశ్వరమ్మ యానిమేటర్‌గా విధులు నిర్వహిస్తూ ఉదయాన్నే గుడికి చేరుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వరమ్మ ఆహ్వానం మేరకు అల్లూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను మాట్లాడుకొని గట్టువారిపాలెం నుండి కొండపాటూరు ప్రయాణిస్తున్న క్రమంలో దమ్మిన వారిపాలెం మలుపులో బస్సును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో 11మందికి గాయాలవగా ముగ్గురు మరణించారు. ఎంఎల్‌ఎ వేగేసిన నరేంద్ర వర్మ ప్రమాద స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడ్డ అందరినీ 108 ద్వారా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎపి 07 టిఎం 0596 ఆటో ద్వారా మృతదేహాలను తరలించారు. మార్చురీ గది నందు మృతదేహాలను భద్రపరిచారు. ప్రమాద సంఘటన గురించి తెలుసుకొని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, డిటి శ్రీదేవి, జనసేన ఇన్‌ఛార్జి నామన శివన్నారాయణ ఏరియా వైద్యశాలకు చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపర్నెంట్ సిద్ధార్థకు సూచించారు. జాయింట్ కలెక్టర్ సుబ్బారావు క్షతగాత్రుల బంధువులు నుంచి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు, వేమూరు

కొల్లూరు మండలం జువ్వలపాలెంలో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా విఆర్‌కె ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరేళ్ల నుండి 15ఏళ్లలోపు విద్యార్థినీ, విద్యార్థులు ఆదివారం సైకిళ్లు అందజేశారు. విద్యార్థినీ, విద్యార్థుల స్థాయిని బట్టి విఆర్‌కె ట్రస్ట్ చైర్మన్ వేములపల్లి రవి కరణ్ సైకిళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నక్క ఆనందబాబు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మైన జువ్వలపాలెంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని పెసర్లంక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకుని పై చదువుల అనంతరం సామాన్య ఉద్యోగిగా బాధ్యతలు చేపట్టిన రవికిరణ్ అంచలంచలిగా ఎదిగి నేడు దేశంలోనే ప్రముఖ కాంట్రాక్టర్లలో ఒకరుగా నిలిచారని అన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల స్ఫూర్తితో గ్రామానికి ఏదో ఒకటి చేయాలనే దృక్పథంతో గత 9ఏళ్లుగా లంక గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఏపీ, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో రవి కిరణ్ అనేక కాంట్రాక్టులు తీసుకుని జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్లు నిర్మిస్తూ ఉత్తమ కాంట్రాక్టర్‌గా గుర్తింపు పొందారని అన్నారు. అంతే కాక తాను సంపాదించిన దాంట్లో పేదవారికి ఖర్చు చేయాలనే దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేపట్టటం గర్వకారణం అన్నారు. విఆర్‌కె ట్రస్ట్ చైర్మన్ రవి కిరణ్ మాట్లాడుతూ తాను ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి మరి తనకు జన్మనిచ్చిన గ్రామానికి, పరిసర ప్రాంతాలకు ఏదో ఒకటి చేయాలనే దృక్పథంతో తన సంపాదనలో కొంత సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తాను ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి ఆదివారం స్వగ్రామం వచ్చి ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఉంటానని అన్నారు. దీనిలో భాగంగా ఒక ఆదివారం లంక గ్రామాలకు చెందిన నలుగురు పేద విద్యార్థులు తన దగ్గరకు వచ్చి పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉందని, తమకు నాలుగు సైకిళ్లు కొనిపించండని అడుగుగా దానికి స్పందించిన తాను ఈ ప్రాంతంలో ఇలాంటివారు అనేకమంది ఉంటారని భావించి వారందరి దగ్గర ఆధార్ కార్డులు సేకరించి ప్రతి ఒక్కరికి సైకిల్‌ను అందించాలనే దృక్పథంతో తన కార్యాలయ సిబ్బంది, తన అనుచరలతో సర్వే నిర్వహించామని తెలిపారు. 255 మంది విద్యార్థులు ఉన్నారని గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ ఈ సైకిళ్లలను అందజేస్తున్నట్లు తెలిపారు. అమర్తలూరు మాజీ ఎంపీపీ గొట్టిపాటి పూర్ణ కుమారి మాట్లాడుతూ వేములపల్లి రవికిరణ్ లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరిస్తుంటే తనకు మరింత ఆసక్తి కలుగుతుందని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పట్ల ప్రేమ అభిమానాలతో ముందుకు తీసుకు వెళ్లాలనే దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. అనంతరం 255 మంది విద్యార్థినీ విద్యార్థులకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసి నమోదు చేసుకున్న ప్రకారం సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సురేష్ కుమార్, ట్రస్టు సభ్యులు వేములపల్లి రాఘవేంద్రరవు, అమృతలూరు మాజీ ఎంపీపీ గొట్టిపాటి పూర్ణకుమారి, కొల్లూరు తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనకాల మధుసూధన ప్రసాద్, రత్న గోపాల్, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, విఆర్‌ఒ జక్రియ, రేపల్లె డిఎస్పి మురళి కృష్ణ, వేమూరి సిఐ రామకృష్ణ, భట్టిప్రోలు ఎస్‌ఐ శ్రీనివాసరావు, తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఆనందబాబు

రాచపూడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో రాచపూడి వెంకటరాఘవరావుకు ఆత్మీయ పురస్కార సభ మారం వారి సేవాసదన్‌లో లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సభలో రాఘవరావు రచనలు, కవితలు గురించి అన్నమనేని వెంకటరావు, డివిఎం సత్య నారాయణ, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డాక్టర్ ఉబ్బా దేవపాలన, వారణాసి రఘురామ శర్మ విశ్లేశించారు. వక్తలు మాట్లాడుతూ రాఘవరావు మంచి కథా రచయితని, సద్విమర్శకడని, ప్రత్యేకించి చలం, శ్రీశ్రీ, యండమూరి రచనలు, సినిమా సాహిత్యంపై మంచి పట్టున్న వాడని పేర్కొన్నారు. 40 ఏళ్లు పోస్టల్ డిపార్ట్మెంట్లో చక్కటి సేవలందించారాని పేర్కొన్నారు. సభా నిర్వహణలో సమయపాలన పాటించే విధంగా అందర్నీ అలవాటు చేశారని పేర్కొన్నారు. అనంతరం రాఘవరావు దంపతులను సాహితీ మిత్ర మండలి, రోటరీ క్లబ్, జానపద కళాపీఠం, ఇతర సాహితీ సంస్థల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. సభలో రొటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, వామరాజు వెంకటేశ్వరరావు, లక్కరాజు విశ్వమోహన్, కెవి పోలిరెడ్డి, కుందా సుబ్బారావు, మిట్టా కామేశ్వరశర్మ, నిమ్మరాజు నాగేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు, ఇనమనమెళ్ళూరు శ్రీనివాసరావు, చెన్నుపాటి రామాంజనేయులు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, పిసిహెచ్ కోటయ్య, ఆర్టిస్టు బాలు, ఊటుకూరు రామకోటేశ్వరావు, సంకా బాబు, మోటుపల్లి రామదాసు, సృజన అధ్యక్షులు దివాకరదత్తు, ఇలపావులూరి శేషతల్ప శాయి, మోటుపల్లి రామదాసు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు హనుమంతరావు, ఈదర శివప్రసాదు పాల్గొన్నారు.

రచియిత రాచపూడి వెంకట రాఘవరావుకు సత్కారం

అనారోగ్యంతో దేవపాల్ మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రంలో దళితవాడకు చెందిన టిడిపి నాయకులు జాలాది సామ్రాట్ తండ్రి దేవపాల్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందర్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సైనిక ఉద్యోగి, విశ్రాంత ఆర్టీసీ డ్రైవరైన దేవపాల్ మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. దేశభక్తియుత ఆందోళన కొనసాగించాలని అన్నారు. సామ్రాట్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

సూదివారిపాలెం రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సూదివారిపాలెం, నాగండ్ల రహదారులకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని సుదివారిపాలెం, నాగండ్ల గ్రామానికి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు గత మూడేళ్లుగా గోతులమయమై పూర్తిగా దెబ్బతిని ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఏనాడు తమ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోలేదని, స్థానిక వైసీపీ నాయకులు కూడా రోడ్డుపై దృష్టి పెట్టలేదని టిడిపి గ్రామ నాయకులు తెలిపారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న విషయాన్ని గ్రామస్తులందరూ శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. సాంబశివరావు రోడ్డు మరమ్మతులకు అవసరమైన నిధులు ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి వెంటనే విడుదల చేయించారు. దీంతో ఆదివారం ఉదయం రోడ్డు నిర్మాణ పనులను ప్రొక్లైన్ ద్వారా గ్రామస్తులు సంబంధిత గుతేదారులు ఆధ్వర్యంలో ప్రారంభించారు.

మాట్లాడుతున్న ఎంపిపి సుంకర సునీత

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండల పరిషత్ సమావేశం హాలులో ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. ఎఒ మొహమ్మద్ ఫారుక్ మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు, భూసార పరీక్షలు, గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం అంశాలను వివరించారు. పసువైద్యాధికారిణి ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు సీతకాల వ్యాధులకు టీకాలు వేస్తున్నామని తెలిపారు. సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందజేస్తున్నామని తెలిపారు. కావలసిన రైతులు తీసుకువెళ్లవచ్చని అన్నారు. పశువుల షెడ్లుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలానికి 20సీట్లు వచ్చాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకోవాలని అన్నారు. హౌసింగ్, ఉపాధి పథకాలపై సమీక్ష చేశారు. పంచాయతీ రాజ్, విద్యుత్, నిర్మాణ, రెవెన్యూ శాఖల్లో సమస్యలు చర్చించారు. కార్యక్రమంలో రత్నం రాజు, ఎంపిడిఒ ఆర్ జనార్ధన్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల సమావేశానికి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీరాల

పందిళ్లపల్లిలోని తోకపేటలో మాచర్ల శ్రీమన్నారాయణ (శివయ్య) ఆధ్వర్యంలో వారి స్వగృహం దగ్గర ఎంఎల్‌ఎ మద్దులూరి మాలకొండయ్యలకు ఆత్మీయ సన్మాన మహోత్సవం నిర్వహిస్తున్నారు. గజమాలతో అభిమాన నేతలను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చేనేతకి మంచి ఆదరణ లభిస్తుందని, చేనేత ఉత్పత్తులు అంతర్జాతీయంగా మార్కెటింగ్ సౌకర్యం కలగజేయుటకు కృషి చేస్తుందని అన్నారు. సీనియర్ నాయకురాలు సజ్జా హేమలత, నాసిక వీరభద్రయ్య, బాలచందర్, లింగమూర్తి, గుత్తి వీరాంజనేయులు పాల్గొన్నారు

ప్రమాదం జరగటానికి ముందు ఎడ్లబండి ముందు నిల్చొని ఉన్న మంత్రి స్వామి

మంత్రి స్వామికి తప్పిన ప్రమాదం

- తిరునాళ్ల సందర్భంగా ఊరేగింపులో బెదిరిన ఎద్దులు
- కిందపడిపోయిన మంత్రి
- అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది

ప్రజాశక్తి-శింగరాయకొండ

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి పెను ప్రమాదం తప్పింది. జరుగుమల్లి మండలం పాలేటిపాడులో గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఎడ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి ఓ ఎడ్ల బండి ముందు నిలబడి చర్నాకోలు ఊపుతున్నాడు. అదే సమయంలో ప్రక్క నుంచి పెద్దగా డీజే సౌండ్ రావడంతో ఎద్దులు బెదిరి ముందుకు కదిలాయి. దీంతో బండి ముందు ఉన్న మంత్రి స్వామి కింద పడిపోయాడు. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో మంత్రి పెను ప్రమాదం తప్పింది. అనంతరం మంత్రి టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెంలోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి నివాసానికి వచ్చి పరామర్శించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్
- దశల వారీ ఆందోళనకు కార్యాచరణ
- పలు తీర్మానాలు ఆమోదం

మాట్లాడుతున్న కొమ్మోజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యా రంగ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు సంఘ కార్యకలాపాలను సమీక్షిస్తూ నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదన్నారు. సమస్యల పరిష్కారమయ్యేంత వరకు ఉపాధ్యాయులు పోరాడాలని, దశల వారీ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు

- విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలి
- జీవో నంబర్ 117 ను రద్దు చేయాలని, ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని తీర్మానించారు.
- ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలి, హై స్కూల్స్ లో రెండు మీడియంల ను సమాంతరంగా నడపాలి.
- మున్సిపల్ టీచర్స్ ప్రమోషన్స్ బదిలీలు వెంటనే చేపట్టాలి వంటి డిమాండ్స్‌తో కలెక్టర్ ,జిల్లా విద్యాశాఖ అధికారి, మండల తహాశీల్దార్, ఎంపిడిఒ ,ఎంఇఒలు అధి కారులకు విజ్ఞాపన పత్రాలు అందజేయాలి.

డిమాండ్ల సాధన కోసం దశల వారీ ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. ఆగస్టు 5 నుంచి 15 వరకూ ఎమ్మెల్యేలకు విజ్ఞాప పత్రాలు, ఆగస్టు 20 నుంచి 30 వరకూ మూడు వేల సంతకాలతో మంత్రులకు విజ్ఞాపన పత్రాలు, సెప్టెంబర్ 1 నుంచి 10 వరకూ ముఖ్యమంత్రికి 50 వేల పోస్టు కార్డులు పంపాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్. చిన్నస్వామి ,రాష్ట్ర కౌన్సిలర్స్, జిల్లా కార్యదర్శులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు

బురదమయంగా మారిన రహదారి (ఫైల్)

ఈ రహదారులపై

రాకపోకలు సాగించేదెలా..?

భగత్‌సింగ్‌నగర్ వాసుల ఆవేదన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కాలనీ అంతటా మట్టిరోడ్లు దర్శనమిస్తాయి. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు కావస్తున్నా సిమెంట్ రహదారులకు నోచలేదు.

సిపిఎం సీనియర్ నాయకులు కీర్తిశేషులు ఏనుగుల పుల్లయ్య హయాంలో పోరాటాల ఫలితంగా దేవుని మాన్యం భూమిలో ఇక్కడ పేదలకు చోటు దక్కింది. పేదలు గూడు కల్పించుకున్నారు. సిపిఎం ఆ కాలనీ నిర్మాణానికి ఉద్యమాలు చేపట్టింది. సౌకర్యాల కల్పనకు పోరాడక తప్పలేదు. విద్యుత్, తాగునీటి వసతుల ఏర్పాటు చేశారు. ఆ కాలనీలో 400 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. రహదారులు లేక... మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ కాలనీలో మట్టి రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వీలుపడటం లేదు. ఇటీవల కురుస్తున్న జల్లుల వర్షాలతో రహదారులు జారుడు బల్లగా మారాయి. కనీసం నడిచేందుకు కూడా వీలుపడటం లేదు. ఆ కాలనీ వాసులు రహదారుల కోసం పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. వర్షాల సమయంలో ఈ రహదారులపై అధికారులు, ప్రజా ప్రతినిధులు నడక సాగిస్తే తాము పడే బాధలు తెలుసుకునే వారని అక్కడి ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. వీలైనంత త్వరగా సిమెంటు రహదారులతో పాటు మురుగు కాలువలు నిరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

- సముద్ర తాబేళ్ల రక్షణకు చర్యలు
- అందుబాటులోకి నగర వనాలు
- జిల్లా అటవీశాఖాధికారి భీమయ్య

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ముఖాముఖి

అటవీ భూముల విస్తీర్ణం తగ్గిపోతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి ఎల్. భీమయ్య తెలిపారు అందులో భాగంగానే మడ అడవులు, అడవుల రక్షణ, వివిధ రకాల జీవులను పరిరక్షిణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అటవీ భూములు, సముద్ర తీర ప్రాంతం అరుదైన జాతులకు ఆవాసంగా ఉన్న నేపత్యంలో సముద్ర తాబేళ్ల సంరక్షణ, నగరవనాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి జిల్లా అటవీశాఖ అధికారి ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాట్లాల్లోనే...

బాపట్ల జిల్లా పరిధిలో 74 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం ఉంది. 9,198 హెక్టార్ల లో అటవీ భూములు ఉన్నాయి. 3 వేల హెక్టార్లలో మడ అడవులు ఉన్నాయి. మడ అడవులు సముద్రం నుంచి వచ్చే ఆటుపోటులకు తీరం కోతకు గురికాకుండా రక్షిస్తున్నాయి. అరుదైన జాతులకు ఆవాసంగా ఉన్నాయి. మడ చెట్లు మత్స్య సంపద పెరగటానికి ఉపయోగ పడుతున్నాయి.వీటి పచ్చదనం వల్ల ఆక్సిజన్ వృద్ధి పెరుగుతుంది .వాతావరణ సమతుల్యతకు మడ అడవులు పయోగపడుతున్నాయి. మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచడం కోసం సముద్ర జలాలు చొచ్చుకుని వచ్చే ప్రాంతాల్లో వీటిని పెంచేందుకు ఫీల్డ్ చానల్స్ ఏర్పాటు చేసి సహజసిద్ధంగా పెంచేలా చర్యలు తీస ుకుంటున్నారు.

అందుబాటులోకి చీరాల, బాపట్ల నగర వనాలు

సముద్రతీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులు సేదతీరేందుకు కోసం బాపట్ల, చీరాల పట్టణాలకు న వీ ం వ ం లో ని సముద్రతీర మార్గంలో నగర వనాలను కేంద్ర ప్రభుత్వ నిధులతో తీర్చిదిద్దుతున్నారు. ఈమేరకు బాపట్ల నగరవనం కోసం రూ 2 కోట్లు, చీరాల నగరవనం కోసం రూ 2 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ పాటికే 70 శాతం పనులు పూర్తి అయ్యాయి. సూదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, సమీప పట్టణంలోని ప్రజలు పచ్చదనం మధ్య సేద తీరేందుకు ఈ నగర వనాలను రూపకల్పన చేశారు. ఇక్కడ వివిద జాతుల మొక్కలు పెంచడంతో పాటు, పచ్చదనం పరిచే పనులు చేపట్టారు. మంచినీటి ప్లాంట్లు,టాయిలెట్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. చిన్నచిన్న పనులు పూర్తి చేసి త్వరలోనే నగర వనాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు.

సముద్ర తాబేళ్ల రక్షణ చర్యలు

అంతరించి పోతున్న జీవుల జాబితాలో సముద్ర తాబేళ్ల ఉన్నాయి. వీటి సంరక్షణ కోసం జిల్లాలో ఏటిమొగ్గ, రామ చంద్రాపురం,పెదగంజాం,కుంకుడుచెట్లపాలెం ,రామాపురం, సూర్యలంకల్లో హేచరీలు ఏర్పాటు చేశారు. తాబేళ్లు ప్రతిఏడాది జనవరి నుంచి మార్చి వరకూ తీరానికి వచ్చి గుడ్లు పెడతాయి. ఆ గుడ్లను సేకరించి పొదిగించి పిల్లలు వచ్చాక క్షేమంగా వాటిని సముద్రంలో విడిచిపెట్టే కార్యక్రమం అమలు చేస్తున్నారు .ఈ ఏడాది 12 వేల గుడ్లను సేకరించి, పొదిగించి వాటి నుంచి వచ్చిన 10 వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలో వదలారు. తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు ఒడ్డుకు వచ్చి వెళ్లే సమయంలో మత్స్యకారులు చేపల వేట కోసం సముద్రం తీరంలో వేసి ఉన్న వలల్లో చిక్కి చనిపోతున్నాయి. అలాంటి సమయాల్లో తాబేళ్ళ రక్షణ గురించి మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు. తాబేళ్ళు గుడ్లు పెట్టే ప్రాంతాలను గుర్తించి వాటిని రక్షిత ప్రాంతాలుగా ప్రకటించి తగిన రక్షణ చర్యలు చేపడుతున్నారు.

అరుదైన జాతుల సంరక్షణ

సముద్రతీర ప్రాంతంలోని మడ అడవులు వివిధ రకాల అరుదైన జాతులకు ఆవాసాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో జంగు పిల్లులు, అడవి పందులు, నక్కలు, నీటి పిల్లులు,నీటి కుక్కలు, కుందేళ్లు ఉన్నాయి. జంగు పిల్లులు బలిష్టంగా ఉండి చూడడానికి పులి లాగా ఉంటాయి. జిల్లాలోని కొత్తపాలెం, దిండి అడవులు, సూర్యలంక అటవీ ప్రాంతంలో జంగు పిల్లులు అధికంగా ఉన్నాయి. అటవీ భూముల్లో వేట నిషేధం ఉంది. ఎవరైనా అటవీ జంతువులను వేటాడితే చర్యలు తీసుకుంటాం.